ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 16 ఆగస్టు 2024 | 5





పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కలల సాకారం దిశగా.. అడుగులు





కాకినాడ పెరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కాకినాడ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి)/కలెక్టరేట్: కాకినాడ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా మంత్రి పవన్‌కళ్యాణ్ తొలుత జాతీయ జెండా ఆవిష్కరించారు. మైదానంలో పోలీసులనుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రసంగించిన పవన్‌కళ్యాణ్ జిల్లాలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తున్నామన్నారు.

జిల్లా అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అన్నిరంగాల్లో జిల్లాను ప్రగతి పథంలో పయనించేలా చేయడానికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు. జిల్లాలో పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి అడుగులు వేస్తున్నామని వివరించారు. అందులోభాగంగా జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వబోతున్నామని తెలిపారు. 78వ స్వాతంత్ర్య వేడుకలు కాకినాడ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి.

స్వాతంత్ర్య ఉద్యమంలో దేశంకోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భగత్‌సింగ్, సుభాష్‌చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు,ప్రతివాద భయంకరాచారిలు చిరస్మరణీయులన్నారు. ఎందరో మహనీయుల త్యాగాలద్వారా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. గాంధీ పిలుపు మేరకు జిల్లాలో చొల్లంగి, ఉప్పాడ తీరంలో నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహం బ్రిటీష్ పాలకులను గడగడలాడించిందన్నారు.

ప్రతి పథకాన్ని విజయవంతం చేస్తాం..

రాష్ట్రంలో సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో సూపర్‌సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వివరించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతిపథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తామన్నారు. నిత్యాన్నదానంతో అన్నార్తుల ఆకలి తీర్చిన అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరును మధ్యాహ్న భోజన పథకానికి అమలు చేస్తున్నామని వివరించారు. జిల్లాలో 1,258 పాఠశాలల్లో 1,22,591మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో పేదలకోసం 11అన్నక్యాంటీన్లు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. పీఎంఏవై పథకం కింద జిల్లాలో వచ్చే అక్టోబర్‌కి 4,500 గృహాల నిర్మాణం పూర్తి చేసేందుకు వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2014 నుంచి 2019 వరకు ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇంకా బకాయిలు చెల్లించాల్సిఉందని, రూ.49కోట్లు త్వరలో చెల్లిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో టిడ్కో ద్వారా రూ.529కోట్లతో 7,288గృహాలను ఐదేళ్లలో నిర్మించగా వీటిలో 3,582 గృహాలను లబ్ధిదారులకు ఇప్పటికే అందాయన్నారు. మిగిలిన ఇళ్లకు కూడా రిజిస్ట్రేషన్, మార్టిగేజ్ పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని హామీఇచ్చారు. కాకినాడ పర్లోవపేట సైట్-బీలో 904 ఇళ్లను వచ్చే డిసెంబర్‌కు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు. జిల్లాలో కాకినాడనుంచి రాజమహేంద్రవరం మధ్యఉన్న ఏడీబీ రోడ్డును పూర్తి చేస్తామన్నారు. విధుల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన ఉద్యోగులకు పవన్ అవార్డులను అందించారు. పవన్‌తోపాటు ఆయన కుమార్తె ఆధ్య కూడా హాజరయ్యారు. కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు.

- అన్నిరంగాల్లో జిల్లాను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన
- పేదోడి సొంతింటి కల సాకారమయ్యేలా చర్యలు
- గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు అందిస్తాం
- 2014-2019లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు రూ.49కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం
- టిడ్కో ఇళ్లు త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తాం
- స్వాతంత్ర్య వేడుకల ప్రసంగంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వెల్లడి
- పోలీసు పరేడ్ మైదానంలో అంబరాన్నంటిన జెండా పండుగ వేడుకలు
- పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండా ఎగురవేసిన పవన్



ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



ఎన్‌సీసీ క్యాడెట్‌లకు బహుమతి ప్రదానం చేస్తున్న పవన్‌కల్యాణ్



వేదికపై పవన్‌తో ఎమ్మెల్యేలు వనమాడి, పంతం, ఎంపీ ఉదయ్



మానసిక దివ్యాంగురాలితో పవన్



ఆకట్టుకున్న కవాతు

కాకినాడ సిటీ, ఆగస్టు 15: కాకినాడలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోలీస్, ఎన్‌సీసీ దళాలు ప్రదర్శించిన సంప్రదాయ కవాతు, శకటాలు ఆహూతులను అలరించాయి. ఉత్తమ కవాతుకుగాను ఆర్మ్‌డ్ రిజర్వ్‌పోలీస్ విభాగానికి ప్రథమ బహుమతి, 3వ ఆంధ్రా ఎన్‌సీసీ బాలికల బెటాలియన్‌కు ద్వితీయ బహుమతి, 8వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌కు తృతీయ బహుమతి లభించాయి. ఉత్తమ శకటాల ప్రదర్శనకుగాను జిల్లా విద్యాశాఖ ప్రథమ బహుమతి, జిల్లాగృహనిర్మాణ సంస్థ ద్వితీయ బహుమతి, జిల్లా గ్రామీణనీటి సరఫరాలశాఖ తృతీయ బహుమతి కైవసం చేసుకున్నాయి. పోలీస్ జాగిలాల విన్యాసాల ప్రదర్శన ఆకట్టుకుంది.



జిల్లా విద్యాశాఖ శకటం(ప్రథమ బహుమతి)



జిల్లా గృహనిర్మాణ సంస్థ శకటం(ద్వితీయ బహుమతి)



జిల్లా గ్రామీణనీటి సరఫరాలశాఖ శకటం (తృతీయ బహుమతి)

ఆకర్షించిన శకటాలు

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిని వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన 11శకటాల ద్వారా ప్రదర్శించారు. తొలుత ప్రదర్శించిన అన్నవరం శ్రీవీరవెంకట సత్యనారాయణస్వామి అలయ శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వరుసగా జిల్లా పౌర సరఫరాల సంస్థ శకటం, జిల్లాగృహనిర్మాణసంస్థ శకటం, జిల్లా విద్యాశాఖ శకటం, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ శకటం, గ్రామీణనీటి సరఫరాలశాఖ శకటం,నీటి యాజమాన్య సంస్థ శకటం, జిల్లా వైద్యఆరోగ్యశాఖ శకటం, పర్యాటకశాఖ శకటం, గ్రామీణాభివృద్ధి సంస్థశకటం, అగ్నిమాపక శకటాలు ఆకట్టుకున్నాయి.



జాగిలాల విన్యాసం

ప్రభుత్వ పథకాల సమాచారంతో స్టాల్స్

ప్రభుత్వ పథకాల సమాచారంతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుల ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శన, ఉద్యాన, మైక్రో ఇరిగేషన్, సెరీ కల్చర్, ప్రజాఫిర్యాదుల పరిష్కారవ్యవస్థ, వ్యవసాయం, అటవీ శాఖ, గ్రామీణఅభివృద్ధి, పట్టణాభివృద్ధిశాఖల డ్వాక్రా ఉత్పత్తులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల కార్యకలాపాల స్టాల్స్, జిల్లా పంచాయతీ, జడ్పీ, పశు సంవర్ధక, మత్స్యశాఖల స్టాల్స్ ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీ, ఉద్యానసెరికల్చర్ ఏపీఎంఏపీ, స్వాతంత్ర్యసమరయోధుల ఆర్ట్‌గ్యాలరీలు వరుసగా బహుమతులు అందుకున్నాయి.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతికకార్యక్రమాలు కనువిందు చేశాయి. నృత్య ప్రదర్శనలు స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటి చెప్పాయి. శంఖవరం కస్తూరీబాగాంధీ బాలికల విద్యాలయం, కాకినాడ-జగన్నాథపురం సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ హైస్కూల్, సాలిపేట మున్సిపాల్ కార్పొరేషన్ బాలికల పాఠశాల విద్యార్థినుల నృత్యప్రదర్శనలు అలరించాయి. ఉమామనోవికాస కేంద్రానికి చెందిన విభిన్న ప్రతిభావంతుల నృత్యప్రదర్శన అబ్బురపరిచింది. కాకినాడ-జగన్నాథపురం సెయింట్ఆన్స్ విద్యార్థులకు ప్రథమ బహుమతి, ఆదిత్య ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులకు ద్వితీయ, శంఖవరం కేజీబీవీ విద్యార్థులకు తృతీయ బహుమతి లభించాయి.

సేవలకు గౌరవం

- ఉత్తమ సేవలందించిన అధికారులకు ప్రశంసాపత్రాలు

కాకినాడ సిటీ, ఆగస్టు 15: జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తూ ఉత్తమ సేవలందించిన అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాకినాడలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా రెవెన్యూఅధికారి డి.తిప్పేనాయక్, జిల్లాముఖ్య ప్రణాళికాధికారి పి.త్రినాథ్, జిల్లా ఆడిట్ అధికారి వై.సురేష్‌బాబు, జిల్లా ఉపాధి కల్పన అధికారి జి.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యఅధికారి డాక్టర్ జె.నరసింహనాయక్, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ పి.రాధాకృష్ణ, ఐఅండ్‌పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.వెంకటలక్ష్మి, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీరమణి, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎంవీ మల్లికార్జునరావు, జిల్లా రవాణా అధికారి ఎ.మోహన్, సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామారావు, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, ఏపీఐడీసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి, ఆర్‌అండ్‌బీ కార్యనిర్వాహక ఇంజనీర్ టి.రమేష్‌కుమార్, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు, కలెక్టరేట్ ఏవో ఎస్.రామ్మోహన్, సూపరింటెండెంట్‌లు ఎంవీఎస్ఎస్ఎన్ జగన్నాథం, సీహెచ్ సంధ్యారాణి, డిప్యూటీ తహసీల్దార్‌లు ఎం.శివరామకృష్ణ, టి.దుర్గాప్రసాద్, పీవీవీ సత్యనారాయణ(రౌతులపూడి మండలం), ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ టి.శ్రీనివాస్(పెదపూడి మండలం), కాకినాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయ ఏవో ఏవీఎస్ చంద్రశేఖర్ ప్రశంసాపత్రాలు పొందారు.



డిప్యూటీ సీఎంనుంచి ప్రశంసాపత్రం అందుకున్న డీఆర్‌వో తిప్పేనాయక్



ముఖ్య ప్రణాళికాధికారి త్రినాథ్



ఆడిట్ అధికారి సురేష్‌బాబు



ఉపాధి కల్పన అధికారి శ్రీనివాసరావు



డీఎంహెచ్‌వో నరసింహనాయక్



జిల్లా పంచాయతీ అధికారి సౌజన్య



పౌరసరఫరాల అధికారి మూర్తి



ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ రాధాకృష్ణ



ఐ అండ్ పీఆర్ డీడీ నాగార్జున



డ్వామా పీడీ వెంకటలక్ష్మి



డీఆర్డీఏ పీడీ శ్రీ రమణి



పంచాయతీరాజ్ ఎస్ఈ మల్లికార్జునరావు



సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి



జిల్లా రవాణా అధికారి మోహన్



ఏపీఐడీసీఎల్ స్పెషల్ డీసీ శ్రీనివాసరావు



బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు

మార్కెట్లకు వరలక్ష్మీవ్రత శోభ

పిఠాపురం/సర్పవరం జంక్షన్, ఆగస్టు 15: మహిళలు అత్యంత పవిత్రంగా భావించే శ్రావణ మాసం. అందులో వరలక్ష్మీ వ్రతం వచ్చిందంటే దానికి విశేష ప్రాధాన్యం. ఇందుకోసం అవసరమైన రూపులు, పూజా సామాగ్రి, పండ్లు, పుష్పాలు కొనేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలతో జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో రహదారులన్నీ జనసంద్రమయ్యాయి. జిల్లాలోని కాకినాడ, పిఠాపురం, సామర్లకోటతోపాటు అన్ని ప్రాంతాల్లోని మార్కెట్లకు వరలక్ష్మీ వ్రత శోభ చేకూరింది. రెండో శ్రావణ శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించే మహిళా భక్తులు పూజాసామాన్లు కొనుగోలు నిమిత్తం సమీపంలోని గ్రామీణ ప్రాంతాలు, పట్టణంలో నుంచి భారీగా తరలిరావడంతో రహదారులు కిక్కిరిసిపోయాయి. గురువారం పిఠాపురం వారపు సంత కావడంతో రద్దీ మరింత అధికమైంది. వ్రతంలో బంగారం లేదా వెండి లేదా రాగితో చేసిన వరలక్ష్మి రూపు ఉంచి పూజ చేస్తే మంచి జరుగుతుందన్నది మంచి కావడంతో మహిళలు రూపులు కొనుగోలుకు రావడంతో బంగారు దుకాణాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మార్కెట్‌లో పండ్లు, పువ్వులు, బట్టల దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. వరలక్ష్మీవ్రతానికి సంబంధించి పూజా సామాగ్రి, పండ్లు, పువ్వులు, అమ్మవార్ల ఫొటోలు, ఇతర సామాన్లు విక్రయించే ప్రత్యేకదుకాణాలు వెలిశాయి. పిఠాపురంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది. చర్చి సెంటర్ నుంచి మార్కెట్, కోటగుమ్మం సెంటర్‌మీదుగా పెద్దబజారు వరకూగల ప్రాంతాలు రద్దీగా మారాయి.



కాకినాడలో వరలక్ష్మి వ్రతం పురస్కరించుకుని జోరుగా సాగుతున్న పూల అమ్మకాలు

పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు

పిఠాపురం, ఆగస్టు 15: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రానికి గురువారం భక్తులు పోటెత్తారు. శ్రావణమాసాల్లో ఇంటివద్ద వరలక్ష్మి వ్రతం ఆచరించే మహిళలు పాదగయ పుష్కరణిలో పుణ్యస్నానాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. స్నానాలు ఆచరించిన భక్తులు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

నేటినుంచే అన్నక్యాంటీన్‌లు పునఃప్రారంభం

కాకినాడ సిటీ, ఆగస్టు 15: పేదల ఆకలి తీర్చేందుకుగాను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పునఃప్రారంభిస్తున్న అన్నక్యాంటీన్‌లు జిల్లాలో ఈ నెల 16వతేదీ శుక్రవారం నుంచి అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే కాకినాడ నగరంలో ఐదు చోట్ల డెయిరీఫారమ్ సెంటర్, సంతచెరువు సెంటర్, అన్నమ్మఘాటీ సెంటర్, వివేకానంద పార్కు, బోట్ క్లబ్ పార్కువద్ద అన్ని సదుపాయాలతో సిద్ధం చేశారు. జిల్లాలో పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోటతో కలిపి మొత్తం 8చోట్ల అన్నక్యాంటీన్‌లు శుక్రవారం నుంచి పేదల ఆకలి తీర్చనున్నాయి. ఈ క్యాంటీన్‌ల ద్వారా ఉదయం టిఫిన్ రూ.5, మధ్యాహ్నం భోజనం రూ.5, రాత్రి భోజనం రూ.5కే అందించనున్నారు. ఆహారం సరఫరా బాధ్యతను ఇస్కాన్ అనుబంధ హరేరామ హరేకృష్ణ ఆధ్యాత్మిక సంస్థకు అప్పగించారు. సోమవారంనుంచి శనివారం వరకు వారంలో ఆరు రోజులు అన్న క్యాంటీన్‌లు పనిచేస్తాయి. ఆదివారం సెలవు దినంగా ప్రకటించారు. ఏ రోజు ఏ టిఫిన్, ఏ ఆహారం అందిస్తారో ఫుడ్ మెనూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు టిఫిన్, మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు భోజనం సరఫరా, రాత్రి 7.30 నుంచి 9 గంటలకు భోజనం అందించనున్నారు.

ఫుడ్ మెనూ ఇదే..

సోమవారం ఉదయం ఇడ్లీ, చెట్నీ, పొడి, సాంబార్ లేదా పూరి, కుర్మా గానీ అందజేస్తారు. మంగళవారం ఉదయం ఇడ్లీ, చట్నీ, పొడి, సాంబార్ లేదా ఉప్మా, చట్నీ, పొడి, సాంబార్ మిక్చర్ గానీ, బుధవారం ఉదయం ఇడ్లీ, చట్నీ, పొడి, సాంబార్ లేదా పొంగల్, చట్నీ, పొడి, సాంబార్, మిక్చర్ గానీ, గురువారం ఉదయం ఇడ్లీ, చట్నీ, పొడి, సాంబార్ గానీ పూరి, కుర్మా గానీ, శుక్రవారం ఉదయం ఇడ్లీ, చట్నీ, పొడి, సాంబార్ గానీ ఉప్మా, చట్నీ, పొడి, సాంబార్, మిక్చర్ గానీ, శనివారం ఉదయం ఇడ్లీ, చట్నీ, పొడి, సాంబార్ గాని, పొంగల్, చట్నీ, పొడి, సాంబార్, మిక్చర్ గానీ సరఫరా చేస్తారు. ఇక భోజనం విషయానికి వస్తే ఆరు రోజులు ఒకే మెనూ అమలు కానుంది. మధ్యాహ్నం, రాత్రి తెల్ల అన్నం,కూర, పప్పు, సాంబార్, పెరుగు, పచ్చడి అందించనున్నారు.



కాకినాడ నగరంలోని సంతచెరువు సెంటర్ వద్ద అన్న క్యాంటీన్

త్రివర్ణ సంబరం


మధురపూడి విమానాశ్రయంలో త్రివర్ణ ధగధగలు


జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

స్వాతంత్ర్య ఫలాలు ప్రతిబింబించాలి : పీడీజే సునీత

రాజమహేంద్రవరం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగ ఫలాలను నేడు అనుభవిస్తున్నామని, అందరం వారికి రుణపడి ఉంటామని.. ఆ స్ఫూర్తి ప్రతి కోర్టులోనూ ఉండే విభాగాల్లో ప్రతిబింబించే విధంగా ఉండాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు ఆవరణలో గురువారం ఆమె జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి, దసరా, దీపావళి పండుగల మాదిరిగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనందకరమన్నారు. జ్యూడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ హాలులో జిల్లా కోర్టు పరిపాలన అధికారి ప్రసన్నకుమారి, జిల్లా కోర్టు ఆవరణలోని హాలులో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తవ్వ త వీరేంద్రనాథ్ జాతీయ జెండాను ఎగురవేశారు. కోర్టుల సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.


విమానాశ్రయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వర్

మధురపూడి విమానాశ్రయం వద్ద ప్రత్యేక అలంకరణ

కోరుకొండ, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం మధురపూడి విమానాశ్రయం వద్ద ప్రత్యేక అలంకరణ చేశారు. విమానాశ్రయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. విమానాశ్రయ డైరెక్టర్ జ్ఞానేశ్వర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విమానాశ్రయంలో పనిచేసే సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కాగా కాకినాడలో జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు మధురపూడి విమానాశ్రయానికి విచ్చేసిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఘనస్వాగతం పలికారు.



గోదావరిలో మువ్వన్నెల రెపరెపలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలెం గోదావరిలో మత్స్యకారులు గురువారం స్వాతంత్ర్య వేడుకలు జరుపుకున్నారు. చేపలు వేటాడే బోట్లలో జాతీయ జెండాలు చేతబట్టి ర్యాలీ చేశారు. ఈ సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. - ఐ. పోలవరం



మౌంట్ ఎల్బ్రస్‌ను అధిరోహించిన భరణి

శిఖరాగ్రంపై జాతీయ పతాకం

అటవీశాఖ అధికారిణి సాహసయాత్ర

జిల్లా అటవీశాఖ అధికారిణి ఎస్.భరణి ఐరోపా ఖండం ఎత్తయిన శిఖరం అయిన మౌంట్ ఎల్బ్రస్‌ను గురువారం మధ్యాహ్నం అధిరోహించారు. ఆమె శిఖరాగ్రంపై దేశ జాతీయ పతాకాన్ని విజయవంతంగా ఎగరవేశారు. ఆమె 5642 మీటర్ల ఎత్తును అధిరోహించారు. - కాకినాడ కలెక్టరేట్

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో

స్వాతంత్ర్య వేడుకలు


ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎడిషన్ ఇన్‌చార్జి, హాజరైన సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు15: ఎన్నో పోరాటాలు, సత్యాగ్రహాలతో అహింసా మార్గంలో సాధించుకున్న స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని, చరిత్రను భావితరాలకు తెలియజెప్పాల్సిన బాధ్యత మనమీద ఉందని ఆంధ్రజ్యోతి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్ అన్నారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు వెలుగుబంద రోడ్డులో ఉన్న ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి ఎడిషన్ ఇన్‌చార్జి పూలమాలవేసి జాతీయజెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి మహనీయుల కృషిని గుర్తుచేస్తూ, ఎందరో త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్య స్వేచ్ఛను పదిలంగా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో యాడ్స్ మేనేజరు పీవీ కృష్ణారావు, సర్క్యులేషన్ మేనేజర్ బొబ్బా గోపాలకృష్ణ, ప్రొడక్షన్ మేనేజర్ రాజేంద్ర, సిస్టమ్ ఇన్‌చార్జి శివ, జిల్లా రిపోర్టర్స్ ఇన్చార్జి ఎన్ఎస్ఎన్ సత్యనారాయణ, డెస్క్ ఇన్‌చార్జులు కిరణ్, ధనుంజయ్, సబ్‌ఎడిటర్లు వీజీ మహేశ్వరరావు, జి.శేషగిరిరావు, రాజు, స్టాఫ్ రిపోర్టర్ పీఆర్ నాగేంద్ర, స్థానిక పాత్రికేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ముఖ్యంగా కాకినాడలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలోని అమలాపురంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరంలో మంత్రి కందుల దుర్గేష్ జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా పోలీసు కవాతులు, సాంస్కృతిక ప్రదర్శనలతోపాటు జిల్లా స్థాయిలో అధికారులకు వివిధ పురస్కారాలను అందజేశారు. ఆ దృశ్యాలివి..



కాకినాడలోని పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. పక్కన సాంస్కృతిక ప్రదర్శన


రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్స్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో జాగిలం నుంచి బొకే అందుకుంటున్న మంత్రి కందుల దుర్గేష్


రాజమహేంద్రవరంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో సాంస్కృతిక ప్రదర్శన



అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల పరేడ్‌లో పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్, యానాంలో సాంస్కృతిక ప్రదర్శన



రాజవొమ్మంగి ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకల దృశ్యం.. ఉత్తమ సేవలందించిన ఉద్యోగికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే



300 అడుగుల జెండాతో ర్యాలీ

అన్నవరం, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని అన్నవరంలో వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 300 అడుగుల జాతీయ జెండాతో శ్రీశారదా విద్యాలయ విద్యార్థులతో భారీ ర్యాలీ గురువారం జరిగింది. ఉదయం 8 గంటలకు స్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్‌రోడ్డు మీదుగా దేవస్థానం కళాశాల మైదానంలో ముగిసింది. కార్యక్రమంలో వాసవీక్లబ్ సభ్యులు దాసరి మురళి, కడిమిశెట్టి సతీష్, ఉద్దగిరి చలమరాజు, బోనగిరి శ్రీనివాస్, శారదా విద్యాలయం కరస్పాండెంట్ కృష్ణవర్మ, తైక్వాండో కోచ్ కేవీ దాసరి నగేష్ పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో గిరిజనాభివృద్ధి కోసం

సమన్వయ కృషి : ఐటీడీఏ పీవో

రంపచోడవరం, ఆగస్టు15: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో గిరిజనాభివృద్ధి కోసం సమన్వయంతో కృషిచేద్దామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పిలుపునిచ్చారు. గురువారం రంపచోడవరం ఐటీడీఏలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. అనంతరం స్థానిక యువజన శిక్షణా కేంద్రంలో ఐటీడీఏ నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొని రంపచోడవరం ఐటీడీఏ ద్వారా జరిగే గిరిజనాభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. గిరిజన అటవీ హక్కుల కల్పన దిశగా 19,613 మందికి 65,096 ఎకరాల అటవీ భూములకు హక్కులు కల్పించామని అన్నారు. విద్య, వైద్య తదితర మౌలిక వసతుల కల్పన కోసం నిరంతర కృషి జరుగుతోందని, పీఎం జన్మన్ పథకం ద్వారా 5264 మంది ఇళ్లు లేని వారిని గుర్తించి తొలివిడతలో 1298 మందికి గృహాలు మంజూరు చేశామన్నారు. కొండరెడ్ల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా చర్యలు అమలులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ పాల్గొన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంతకుమార్, రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి, మాజీ ఎమ్మెల్యేలు నాగుళ్లపల్లి ధనలక్ష్మి, కోసూరి కాశీ విశ్వనాథ్, ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, గిరిజన సంక్షేమ ఇన్చార్జి జాన్‌రాజ్, ఏపీవో శ్రీనివాస్, ఏవో రమణ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తితో గిరిజనాభివృద్ధికి ప్రణాళికలు : ఎమ్మెల్యే


స్వాతంత్ర్య స్ఫూర్తితో తమ ప్రభుత్వం ద్వారా గిరిజనాభివృద్ధికి ప్రణాళికలను అమలు చేస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. గురువారం రంపచోడవరం ఐటీడీఏ నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం గిరిజనాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిధిలో ఉత్తమ సేవలందించిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని అభినందించారు. అతిథులకు జ్ఞాపికలు అందించారు.


అగ్నిప్రమాదంలో దగ్ధమైన బైక్, లారీ

లారీ ట్యాంకరు నుంచి డీజిల్ లీక్‌తో అగ్నిప్రమాదం.. లారీ, బైక్ దగ్ధం

మండపేట, ఆగస్టు 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట బైపాస్ రోడ్డులో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో లారీ, బైక్ ఆహుతి అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన అబ్బిరెడ్డి సింహాచలం తన లారీని మరమ్మతుల కోసం బైపాస్‌లోని ఒక మెకానిక్ షెడ్డులో ఉంచాడు. అక్కడ గ్యాస్ కటింగ్ పనులు చేస్తుండగా లారీ ట్యాంకరు నుంచి డీజిల్ లీకైంది. క్షణాల్లో మంటలు వ్యాప్తి చెందడంతో సమీపంలోని షెడ్ల నిర్వాహకులు పరుగులు తీశారు. వెంటనే మండపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఏ మాత్రం ఆలస్యమైనా ట్యాంకు పేలి భారీ ప్రమాదమే సంభవించి ఉండేది. లారీ చెంతనే ఉన్న ఒక బైక్ పూర్తి దగ్ధం కాగా, రెండు బైక్‌లు లారీ దెబ్బ తిన్నాయి. రూ.8.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని మండపేట ఫైర్ ఆఫీసర్ హనుమంతరావు తెలిపారు.


వాడపల్లి వసంత మండపంలో స్వామి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం


వాడపల్లి స్వామి ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్నకు కిరీటాలు అందిస్తున్న దాతలు

అంగరంగ వైభవంగా పవిత్రోత్సవాలు

తిరుచీ వాహనంపై శ్రీవారి విహారం

రెండో రోజు పవిత్రోత్సవ ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, ఆగస్టు15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు గురువారం అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దోష పరిహారార్థం తిరుమల తరహాలో స్వామివారి పవిత్రోత్సవాలు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో క్రతువును వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించి వసంత మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. పవిత్రాలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. విశ్వక్సేనపూజ, పవిత్ర ప్రతిష్ఠ, ప్రధాన హోమాలు, పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలను వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ ఘనంగా నిర్వహించారు. ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ చేతుల మీదుగా పవిత్రోత్సవ పూజలు నిర్వహించారు.

తిరుచీ వాహనం, వెండి కిరీటాలు...

స్వామివారి పవిత్రోత్సవాల్లో భాగంగా దాతలు సమర్పించిన తిరుచ్చి వాహనం, వెండికిరీటాలకు సంప్రోక్షణ పూజలు నిర్వహించి అలంకరించారు. పాలకొల్లుకు చెందిన తటవర్తి సుధాకరరావు-లక్ష్మీశారదదేవి దంపతులు స్వామివారికి తిరుచ్చి వాహనం బహూకరించారు. వాడపల్లికి చెందిన యెరుబండి రాజు, సూర్యకుమారి దంపతులు విశ్వక్సేనుల వారికి 200 గ్రాముల వెండి కిరీటం, ఉత్సవమూర్తికి కిలో వెండి కిరీటాలు తేతలి సోమసుందరరెడ్డి, సుధ దంపతులు ఇచ్చారు.

తొమ్మిది పశువులు, వ్యాన్ స్వాధీనం

గండేపల్లి, ఆగస్టు 15: గండేపల్లి జాతీయ రహదారిపై అక్రమంగా రవాణా చేస్తున్న పశువుల వ్యాన్‌ను గురువారం గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు అడ్డుకుని తొమ్మిది ఎద్దులను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఎద్దులను సంరక్షణ నిమిత్తం గోశాలకు తరలించారు. ఈమేరకు దీనిపై కేసు నమోదు చేశారు. పశువులను అక్రమంగా తరలిస్తే కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. హైవేపై ఎప్పటికప్పుడు పోలీసు గస్తీ నిర్వహిస్తామని ఎస్ఐ తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

అట్టహాసంగా కళాశాల అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం

తుని రూరల్, ఆగస్టు15:తుని పట్టణంలో బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే యనమల దివ్య హాజరై సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా డి.వెంకట్రాజు, కార్యదర్శి మోహన్‌కృష్ణ, కోశాధికారిగా ఎన్.చక్రవర్తుల నారాయణాచార్యులు సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు.


ఎన్‌సీసీ క్యాడెట్లు నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న వీసీ మురళీకృష్ణ


జాతీయ జెండాను ఎగురవేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్


జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్


కాకినాడలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ భావన

21వ శతాబ్దం భారతదేశానిదే

• జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ
• ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

జేఎన్టీయూకే, ఆగస్టు 15 : 21వ శతాబ్దం భారతదేశానిదని, ఈ దేశంలో పుట్టినందుకు మనమంతా గర్వించాలని కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీ లాన్‌లో గురువారం నిర్వహించిన 78వ స్వాతంత్య్ర వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమాన్ని వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షత వహించగా రెక్టార్ కేవీ రమణ, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, డైరెక్టర్లు వి.రవీంద్ర, ఎ.గోపాలకృష్ణ, జి.పద్మజారాణి, బాలకృష్ణ,బాలాజీ పాల్గొన్నారు.

జిల్లా కలెక్టరేట్‌లో..

కలెక్టరేట్(కాకినాడ): కలెక్టరేట్‌లో స్వాతంత్ర వేడుకలను పురస్కరించుకుని గురువారం కాకినాడ కలెక్టరేట్ ఆవరణలోని వంద అడుగుల జాతీయ జెండాను కలెక్టర్ షాన్‌మోహన్, వివిధ శాఖల అధికారులతో మీటనొక్కి ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ జిల్లా ప్రజలందరికీ 78వ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సీపీవో త్రినాథ్, పౌరసరఫరా సంస్థ డీఎం బాలసరస్వతి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాకినాడ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ భవనంలో

ది కాకినాడ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ భవనంలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. కాకినాడ అర్బన్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

కాకినాడ క్రైం: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశభక్తి కలిగి ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, చంద్రశేఖర్, డీఎస్పీ రామకృష్ణ, ఆర్ఐ వెంకటరావు పాల్గొన్నారు.

జిల్లా టీడీపీ కార్యాలయంలో..

కాకినాడసిటీ: కాకినాడజిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీమంత్రి చిక్కాల రామ చంద్రరావు జాతీయ జెండాను ఎగురవేశారు. టీడీపీ నాయకులు పెంకే శ్రీనివాసబాబా, మల్లిపూడి వీరు, వనమాడి మోహనవర్మ పాల్గొన్నారు.

స్టాల్స్‌ను సందర్శించిన కొండబాబు

కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సందర్శించారు.

ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీలకు సత్కారం

కాకినాడ గాంధీనగర్ పార్కులో గురువారం టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజులను సత్కరించారు. డాక్టర్ కొండమూరి జాతీయ జెండా ఎగురవేసి స్వీట్లు పంచారు.

ఎన్జీవో హోంలో స్వాతంత్య్ర వేడుకలు

ఏపీ ఎన్జీవో హోంలో గురువారం స్వాతంత్య్ర వేడుకలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, జిల్లా సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దేశ, ప్రజాసేవలో ముందుండాలి: కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ): కాకినాడ కొండయ్యపాలెం శారదా దేవి గుడివద్ద ఉన్న నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో స్వాతంత్య్ర వేడుకల్లో కమిషనర్ భావన మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. వివేకానంద పార్కు ఆవరణలో ఈఈ మాధవి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కమిషనర్ భావన పాల్గొన్నారు. ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్ పాల్గొన్నారు.

త్యాగధనుల సేవలు చిరస్మరణీయం: చినరాజప్ప

సామర్లకోట: దేశ స్వాతంత్య్రం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన త్యాగ ధనులను స్మరించుకుంటూ నేటి తరానికి వారి త్యాగాలను తెలియజెప్పాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రధాన వైద్యురాలు డాక్టర్ అమల తదితర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయపతాకాన్ని ఎగురవేశారు. పట్టణంలోనూ, మండలంలోనూ పలు ప్రభుత్వ కార్యాలయాల ఎదుట, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల ఎదుట జాతీయ పతాకాలను ఎగురవేశారు. సామర్లకోట తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీఆర్వోలు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జీ. అరుణ, మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో ఎంపీపీ


టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద జెండా ఎగుర వేసిన చిక్కాల రామచంద్రావు

సత్తిబాబు, జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. దేశనాయకులు మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్, జ్యోతీబాపూలే విగ్రహాలకు జెడ్పీటీసీ ఎలిశెట్టి అమృతానరేష్‌లు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఏవో మంగతాయారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ పీవీఆర్‌మూర్తి, రైల్వే స్టేష న్లోస్టేషన్‌లో మహాత్మాగాంధీ విగ్రహాలకు సూపరింటెండెంట్ ఎం.రమేష్ పూలమాలలు వేసి జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాయలం వద్ద సబ్ రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి, ఈటీసీ ఆవరణలో ప్రిన్సిపాల్ జె. వేణుగోపాల్, ఆయోధ్యరా మపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయి రామకృష్ణ, ప్రతిభ విద్యాసంస్థల ఆవరణలో ఎస్వీపీజీ. ప్రకాష్‌లు జాతీయ పతాకాలను ఎగుర వేశారు. సామర్లకోట ఎంపీడీవో కార్యాలయంలో స్వాతంత్య్రదినోత్సవ వేడుకలు గురువారం ఆలస్యంగా 10.30గంటల వరకూ ప్రారంభం కాలేదు.

పెద్దాపురం: స్థానిక సుధాకాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంవద్ద ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్‌చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ జెండాను ఎగురవేశారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సీతారామారావు, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ లతాకుమారి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పెంకే సత్యవతి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ, పోలీసుస్టేషన్‌వద్ద సీఐ క్రాంతికుమార్, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జెండాను ఆవిష్కరించారు.

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగఫలం చిరస్మరణీయం

తుని రూరల్: స్వతంత్ర సమరయోధుల త్యాగఫలం చిరస్మరణీయమని తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తేటగుంట పార్టీ కార్యాలయంతోపాటుగా తుని పట్టణంలోగల బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని జెండాను ఎగురవేశారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు తదితరులు ఉన్నారు.

మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి: ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్: దేశ స్వాతంత్య్రంకోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయులు, స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుని దేశభక్తి కలిగి ఉండాలని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. గురువారం వలసపాకల జనసేన పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. పార్టీ నాయకులు కరెడ్ల గోవిందు, తాటికాయల వీరబాబు, శిరంగు శ్రీనివాసరావు, జీని శ్రీనివాస్, పోసిన రాము, దాసరి శివ, కడలి ఈశ్వరి, కుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన త్రివర్ణ పతాకం

గండేపల్లి: మండలంలో మురారి హైస్కూల్, మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, మల్లేపల్లి, యల్లమిల్లి, తాళ్ళూరు పాఠశాలల్లో, ప్రగతి, ఆదిత్య కళాశాలల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. నీలాద్రిరావుపేట శ్రీకిరణ్ పాఠశాలలో జెండా వందనం చేశారు. రిటైర్డు జవాన్లను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఆదిత్య వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి, ప్రగతి చైర్మన్ పరుచూరి కృష్ణారావు, జాస్తి వసంత్, ఎస్ఐ శివనాగబాబు, ఎంపీడీవో హనుమంతరావు, సుంకవిల్లి రాజు, కరస్పాండెంట్ శ్రీనివాస్, మల్లేపల్లి హెచ్ఎం సుధామాధురి, శీలామంతుల వీరబాబు, పెనుమర్తిభాస్కరరావు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో వివిధ ప్రాంతాల్లో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, సాహితీ స్కూల్‌లో కవి, ప్రముఖ సైకిల్ యాత్రికుడు లోహిచోచికోరున్, భాష్యం స్కూల్లో ప్రముఖ వైద్యులు బీఎస్వీ ప్రసాద్, రామవరం గ్రామంలో జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, బలభద్రపురం ఎంపీపీ పాఠశాలలో కాంగ్రెస్‌ఇన్‌చార్జ్ మరోతి శివ గణేష్, ఆర్యవైశ్య కల్యాణ మండపంవద్ద ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు జెండా ఆవిష్కరణలు చేశారు. ఇర్రిపాక గ్రామం సచివాలయం వద్ద, వివిధ పాఠశాలల స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జగ్గంపేటలోని స్టెర్లింగ్ వండర్ కిడ్స్ స్కూల్‌లో వేడుకలు నిర్వహించారు.

కిర్లంపూడి: వీరవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, కిర్లంపూడి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చిరంజీవి, జగపతినగరం పంచాయతీలో


సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సతీష్, కిర్లంపూడి కొక్కొండ రామశేషగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఆళ్ల బాబులు, భూపాలపట్నంలో సర్పంచ్ వీరరెడ్డి కాశీబాబు జెండా వందనం చేశారు. జగపతినగరంలో ఎస్ ఎల్‌వీ పాఠశాలలో టిబిరిశెట్టి వెంకటేశ్వరరావు, సూరిబాబు, కరస్పాండెంట్ సత్యసరస్వతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎస్ఐ సతీష్‌ను సన్మానించారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

మండలంలోని రామచంద్రపురంలో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించి బియ్యం, నిత్యావసరుకులు పంపిణీ చేశారు.

తాళ్లరేవు: తాళ్లరేవు తహసీల్దార్ ఎం.సూరిబాబు, డీసీఎస్ డాక్టర్ శిరీష, మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు రాయుడు సునీత జాతీయజెండాలను ఎగురవేశారు. 17గ్రామపంచాయతీలు, ప్రభుత్వపాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా వందనం నిర్వహించారు. తాళ్లరేవు మండల ప్రజాపరిషత్ కార్యవర్గం ఎంపీటీసీ సభ్యులు జాతీయ జెండావందనం కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. తాళ్లరేవు ఆసుపత్రి సభ్యులు రోళ్ల శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో దాతలు ఆసుపత్రికి కుర్చీలు, బెడ్‌షీట్లను సూపరింటెండెంట్ శిరీషకు అందజేశారు.

కొత్తపల్లి : ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ కారే సుధా శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.చిన్నారావు జాతీయ జెండాలను ఎగురవేశారు. పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ పీవీ స్వామినాయుడు, కొత్తపల్లిలో సర్పంచ్ గవర గంగాభవానీ నాగేశ్వరరావు, వాకతిప్పలో సర్పంచ్ పాలాని దొరబాబు, కుతుకుడుమిల్లిలో సర్పంచ్ కర్రి చిన్నారావు, ఉప్పాడలో సర్పంచ్ ఉమ్మిడి మేరీజాన్, అమీనబాద్‌లో నక్కా మణికంఠ, నాగులపల్లిలో వడిశెట్టి గౌరీరాజేశ్వరినారాయణరెడ్డి, కొండెవరంలో వేమగిరి చెల్లాయ్యమ్మ, కొమరగిరిలో డాక్టర్ కండిపల్లి సత్యశ్రీ, గోర్స లో రొంగళ వీరబాబు, శ్రీరాంపురంలో రావి రమేష్, పొన్నాడలో బండి రాణిదావీదు, మూలపేటలో కంబాల మౌనికలక్ష్మణ్, ఇసుకపల్లిలో సర్పంచ్ సన్నిబోయిన రిబ్కా, పలు ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్లు జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో కొత్తపల్లి జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, జనసేన నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, రావు అక్షయ్, గంటా విజయ్‌కుమార్(జీవీకే) గవర రాంబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ జెండా ఎగురవేశారు. ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, ఎంఈవో వి.రాజబాబు, ఎంపీడీవో ఎస్. డేవిడ్‌రాజు, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్ తదితరులు విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రత్తిపాడు కోర్టు వద్ద ఇన్‌చార్జ్ జడ్జి సి.బుల్లెమ్మ జెండా ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంవద్ద తహసీల్దార్ సూర్యప్రభ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సబ్ రిజిస్ట్రార్ టి.సుబ్బారెడ్డి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ ఎం.పవన్‌కుమార్, ఎక్సైజ్‌స్టేషన్‌వద్ద సీఐ ఎల్. చిరంజీవిలు జెండా ఎగురవేశారు. ప్రత్తిపాడు, ధర్మవరం గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్‌లు గుడాల విజయలక్ష్మి, వెంకటరత్నం, బెంతుకర్తి సుశీల అబ్బాయిలు, రాచపల్లి పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారి ఆర్ఆర్ పవన్‌కుమార్ జెండా ఎగురవేశారు.

సర్పవరంజంక్షన్: రమణయ్యపేట మండల కార్యాలయంలో ఎంపీడీవో రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఇన్‌చార్జి ఎంపీపీ బందిలి విరీష, సర్పవరం జంక్షన్‌లో రెవెన్యూ కార్యాలయంలో జాతీయ జెండాను తహసీల్దార్ గోపాలకృష్ణ, సర్పవరం పోలీస్ స్టేషన్ సీఐ బొక్కా పెద్దిరాజు, రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, వాకలపూడి ఉమా మనో వికాస కేంద్రంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి రెడ్డి, తిమ్మాపురం అక్కా ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ, సర్పవరం జంక్షన్‌లో పాసింజర్ ఆటో డ్రైవర్స్ ఓనర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సంఘం అధ్యక్షుడు పుల్ల శ్రీరాములు, కండేపల్లి కుమార్‌లు, తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తిమ్మాపురంలో 30 మంది పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి, నూతన వస్త్రాలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. సర్పవరంలో సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, సూర్యారావుపేటలో సర్పంచ్ సూరాడ చిన్నిరాజు, నేమాం సర్పంచ్ రాందేవు చిన్నలు జాతీయ పతాకా


స్టాల్స్‌ను సందర్శిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

లను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. రమణయ్యపేటలో బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కన్వీనర్ రంభాల వెంకటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

● వైద్యనగర్ వైసీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమక్షంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

ఏలేశ్వరం: మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాలు, పార్టీ కార్యాలయాలు, సేవా సంస్థల్లో జాతీయ జెండాను ఎగుర వేశారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొని జాతీయ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, నగర పంచాయితీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, జ్యోతుల పెదబాబు, చిక్కాల రాజ్యలక్ష్మదేవి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, కొప్పుల బాబ్జి, జిగటాపు సూరిబాబు, పెంటకోట శ్రీధర్, చిక్కాల లక్ష్మణరావు, నూకతాటి ఈశ్వరుడు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కరప: కరప ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పిండి గోపాలకృష్ణ, పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ ప్రసన్నకుమార్, వేళంగి పీహెచ్‌సీలో వైద్యాధికారిణి ఎంకే సౌజన్య, విద్యావనరుల కేంద్రంలో ఎంఈవోలు కొప్పుల బులిశృష్ణవేణి జెండా ఎగురవేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో గుత్తుల భీమశంకరరావు, జనసేన నాయకులు, పత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

● కరప హైస్కూల్‌లో గత పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి మొదటి ఐదుస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు 1983-85 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థులు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

● కొరుపల్లి ప్రాథమిక పాఠశాలలో చదివి ప్రస్తుతం ఎస్ఐ, బ్యాంక్ మేనేజర్లుగా పనిచేస్తున్న అన్నాచెల్లెలు అదే పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన ప్రస్తుత విద్యార్థులకు వారి తండ్రి వాసంశెట్టి స్వామిచంద్రబోస్ చేతులమీదుగా నగదు పురస్కారాలు అందజేశారు.

● టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం కార్యదర్శి చప్పిడి వెంకటేశ్వరరావు కరప మెయిన్ స్కూల్, రామకంచిరాజునగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకన్నతో కలిసి పాల్గొన్నారు.

● కరప మహాత్మజ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయంలోని 350మంది విద్యార్థులకు దాత పంపన విజయరాజు మధ్యాహ్న భోజనం అందజేశారు.

తొండంగి: తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మురారీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. దివిస్ లేబరేటరీస్‌లో జరిగిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ నాగేశ్వర్, ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీటీసీ మేరుగుపద్మలత జాతీయ జెండాను ఎగురవేశారు. ఏవీ నగరం ఉన్నత పాఠశాలలో కెనరాబ్యాంకు వారు ఎస్సీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో జెండాలను ఎగురవేశారు. మండలంలో జరిగిన కార్యక్రమాల్లో టీడీపీ సీనియర్ నాయకులు యనమల రాజేష్, కొయ్యా రామకేశవ తదితరులు పాల్గొన్నారు. ఏవీనగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం స్టాఫ్‌నర్సు చందక వెంకట ప్రభకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది.

శంఖవరం: మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాలలో స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంవద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీపీ పర్వత రాజుబాబు జెండా ఎగురవేశారు.

కోటనందూరు: మండలంలోని గ్రామాల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయంవద్ద తహశీల్దార్ సుభాష్, పోలీస్ స్టేషన్‌వద్ద ఎస్ఐ శంకర్, హైస్కూల్ చైర్మన్ శ్రీను, మదర్ విద్యాసంస్థలలో రావాడ వరహాలుబాబు, టీడీపీ పార్టీ కార్యాలయంవద్ద మండల టీడీపీ అధ్యక్షుడు గాడి రాజబాబు జెండాలను ఆవిష్కరించారు.

రౌతులపూడి: ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో, బలరా మపురం, రౌతులపడి హైస్కూల్‌లో చైర్మన్‌లు, యగదాసు హరిబాబు, షేక్ సలీం మండల పరిషత్ కార్యాలయవద్ద ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి జెండాను అవిష్కరించారు. డిప్యూటీ తహశీల్దార్ టీవీవీ సత్యనారాయణ ఉత్తమ అధికారిగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నుంచి అవార్డు అందుకున్నారు.

పేదలకు అండగా యనమల ఫౌండేషన్

● శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు


మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తునిరూరల్, ఆగస్టు 15: పేద, మధ్యతరగతి కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు పలుసేవా కార్యక్రమాల్లో చేదోడువాదోడుగానిలుస్తున్న యనమల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య హాజరై సుమారు 300 మందికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి), కోడా వెంకటరమణ, గజ్జి అప్పలరాజు, చిరంజీవిరాజు, జక్కాన రాముననాయుడు, గజ్జి రాంబాబు, గంట్ల చిన్నారావు తదితరులు ఉన్నారు.

జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు ప్రత్తిపాడు ఎంపీపీ ఎంపిక

ప్రత్తిపాడు, ఆగస్టు15: గుజరాత్‌లో ఈనెల 19 నుంచి 23వరకు జరిగే జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు రాష్ట్రం తరుపున కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల పరిషత్ అధ్యక్షుడు గోళ్ళ కాంతి సుధాకర్ ఎంపికయ్యారు. రాష్ట్రం తరుపున ముగ్గురు ప్రజా ప్రతినిధులు, మరో ముగ్గురు గ్రూప్1 అధికారులు ఈ సదస్సులో పాల్గొనేందుకు ఎంపిక కాగా వారిలో ప్రత్తిపాడు ఎంపీపీ ఒకరు. గ్రామీణాభివృద్ధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి గుజరాత్‌లో జరిగే సదస్సులో వివరించనున్నట్లు ఎంపీపీ సుధాకర్ తెలిపారు. ప్రత్తిపాడు ఎంపీపీని పలువురు అధికారులు, నాయకులు అభినందించారు.

గేదెలను కడిగేందుకు చెరువులోకి దిగి వ్యక్తి మృతి

గండేపల్లి, ఆగస్టు 15: మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన వల్లభిశెట్టి సూరిబాబు(43) గ్రామంలో నల్లచెరువులోకి గేదెలను తోలుకెళ్లి మృతి చెందాడు. గ్రామస్తులు సమాచారం ప్రకారం గురువారం గేదెలను మేపుకుంటూ పొలానికి వెళ్లాడు. గేదెలను కడిగేందుకు నల్లచెరువులోకి దిగి ప్రమాదవశాత్తూ పడి మృతి చెందాడు. గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ఒక అబ్బాయి, అమ్మాయి ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

● బ్లాక్ డే గా పాటించిన మాలమహానాడు నేతలు

పిఠాపురం, ఆగస్టు 15: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఏపీ మాలమహానాడు ఆధ్వర్యంలో గురువారం బ్లాక్ డేగా పాటించారు. పట్టణంలోని ప్రదర్శన జరిపి పిఠాపురం మునిసిపల్ కార్యాలయ ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆందోళనలో ఏపీ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు, దారా వెంకట్రావు, ముంజవరపు కృపానందం పాల్గొన్నారు.

కొత్తపల్లి: ఎస్సీఎస్టీలను ఉపకులాలుగా వర్గీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారమిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ స్వాతంత్ర దినోత్సవాన్ని బ్లాక్‌డేగా పాటిస్తున్నామని కొత్తపల్లి మండల పీవీ రావు మాలమహానాడు కార్యదర్శి బత్తుల రాంజీకుమార్ తెలిపారు. వాకతిప్పలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లజెండాలు, నల్లబ్యాడ్జీలతో పీవీరావు మాలమహా నాడు కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ నిరసనలో ఈరు గుల శ్రీనివాసరావు, దాకే రాజ్‌కుమార్, సాంబశివ, బాపిరాజు, దాకే కృష్ణ, బత్తిన శ్రీనివాసరావు, దాకే ఆశీర్వాదం పాల్గొన్నారు.

రేపూరులో ఇరువర్గాల మధ్య వివాదం

● గాయపడ్డ జనసేన కార్యకర్త

కాకినాడ రూరల్, ఆగస్టు 15: రూరల్‌మండలం రేపూరులో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో జనసేన, వైసీపీ నాయకుల మధ్య గురువారం వివాదం చోటుచేసుకుంది. విద్యార్థులకు బహుమతుల పంపిణీలో ఇరువురి మధ్య వాగ్వాదం జరగడంతో వైసీపీకి చెందిన సర్పంచ్ నక్కా వీరన్న కుటుంబసభ్యులు, జనసేన కార్యకర్తలు కాకర్ల శ్రీనివాస్, ముమ్మిడి శ్రీను మధ్య కొట్లాట జరగడంతో జనసేనకు చెందిన కాకర్ల శ్రీనివాస్, వైసీపీకి చెందిన కాశీవిశ్వేశ్వరరావు గాయపడ్డారు. దీనిపై ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్‌ను వివరణ కోరగా ఇరుపార్టీల కార్యకర్తల ఎమ్మెల్సీ రిపోర్ట్ ఆధారంగా వారి ఫిర్యాదుమేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

జగ్గంపేట, ఆగస్టు 15: జగ్గంపేట శివారు రహస్యంగా నిర్వహిస్తున్నపేకాట శిబిరంపై గురువారం సాయంత్రం ఎస్ఐ రఘునాధరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో ముగ్గురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.3,300లు నగదును, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కోర్టులో హాజరుపరుస్తామని అన్నారు. జగ్గంపేట మండల పరిధిలో పేకాట, కోడిపందాలు వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

కారును ఢీ కొట్టిన లారీ: తప్పిన ప్రమాదం

జగ్గంపేట, ఆగస్టు15: జగ్గంపేటలోని జేవీఆర్ జంక్షన్ వద్ద రోడ్డుప్రమాదం జరిగింది. స్థానికుల వివరాలు ప్రకారం విశాఖపట్నం నుంచి రాజమండ్రివైపు వెళుతున్న కారును అదే మార్గంలో వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో కారు రోడ్డుకు అడ్డంగా తిరిగింది. కారు పూర్తిస్థాయిలో దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగానే ఉండటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న హైవేపోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.


చీడిగలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం


కరప తహశీల్దార్ కార్యాలయంవద్ద జెండా వందనం చేస్తున్న తహశీల్దార్


తిమ్మాపురంలో పారిశుధ్య సిబ్బంది కాళ్లు కడిగి సత్కారం చేస్తున్న సర్పంచ్ బెజవాడ

పారిశుధ్య కార్మికులకు సత్కారం

కాకినాడ రూరల్, ఆగస్టు 15: కాకినాడ రూరల్ మండలం చీడిగ పాతపంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పంతం నానాజీ, కోఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు ఆదేశాల మేరకు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పితాని అప్పన్న ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సత్కరించి రెయిన్ కోట్‌లను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు అచ్యుతరామయ్య, శ్రీను, శివ,రామకృష్ణ, భాస్కరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

18న మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం

పెద్దాపురం, ఆగస్టు 15: ఈనెల 18న మరిడమ్మ దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. జాతర ముగింపు సందర్భంగా ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టామని ఆయన పేర్కొన్నారు.

పదిలో ప్రతిభచూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

కొత్తపల్లి, ఆగస్టు15: పదో తరగతిలో అత్యున్నత ప్రతిభచూపిన ముగ్గురు విద్యార్థులకు కొండెవరానికి చెందిన డోనర్లు వెలుగుల మహేష్‌రాజా, ఎల్లాప్రగడ వెంకటరమణలు గురువారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. మేడిశెట్టి హర్షిణి, గంగిరెడ్డి సుభాషిణి, రోహిణిలకు రూ.10వేల చొప్పున నగదు అందజేశారు. దాతల ఔదార్యాన్ని సర్పంచ్ వేమగిరి చెల్లాయ్యమ్మ, ఎంపీటీసీ దుళ్ళ సత్తిబాబు, గ్రామ టీడీపీ నాయకుడు వేమగిరి రాంబాబు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు గాది రాజబాబు, కూరాకుల సుధాకర్, ప్రముఖ రచయిత బర్రే సత్యనారాయణ, మేడిశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కోటనందూరు ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

కోటనందూరు, ఆగస్టు 15: కోటనందూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సుబ్రహ్మణ్యశర్మ బాధ్యతలు స్వీకించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో ఎన్.జయమాధవి రిలీవ్ అయ్యారు.

చెందుర్తిలో చోరీ

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 15: మండలంలోని చెందుర్తిలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన సాగి రాజు సత్యనారాయణ తన ఇంటికి తాళం వేసుకుని కుటుంబసభ్యులతో కలిసి బుధవారం బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి, గురువారం తెల్లవారుజాము సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు, బీరువాల తాళాలు బద్దలుగొట్టి కిలో వెండి వస్తువులు, బంగారు ఆభరణాలు, నగదును అపహరించారు. గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ, క్లూస్‌టీమ్ సభ్యులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు.

ఘనంగా ప్రారంభమైన శ్రావణ మాసోత్సవాలు

అన్నవరం, ఆగస్టు 15: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం చైర్మన్ రోహిత్ పండితులకు దీక్షా వస్త్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆలయంలో జపములు, పారాయణలు, సూర్యనమస్కారములు, లింగార్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు అమ్మవారికి లక్షకుంకుమార్చనలు జరిగాయి. ఈ ఉత్సవాలు ఈనెల 19తో ముగియనున్నాయి. ఐదురోజులు అమ్మవారిని విశేష అలంకరణతో భక్తులకు దర్శనమిస్తారు. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

కాకినాడ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P. 2/2022 in O.S. 411/2019

Between
కర్రి భయమ్మ .. DHr
AND
1. వోలేటి ఈశ్వరి
2. వోలేటి మల్లేశ్వరరావు .. JDR's

పై నెంబరు అమలు గ్రంథములో JDR'S వద్ద నుండి DHR కు రావలసిన డిక్రీ బాకీ గాను JDR'S తాలూకు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలపు యిస్తిహార్లు షరతులకు లోబడి ది.11-09-2024వ తేదిన ఉదయం గం.10.30 ని.లు లగాయితు పై కోర్టువారి ఎదుట బహిరంగ వేలం వేయుదురు. ఈ వేలం చనిపోయిన వోలేటి సూర్య కుమారి గారి తనఖా బాకీ రూ. 8,79,500/- లు, లోబడి జరుపబడును. సదరు JDR'S తాలూకు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ఎవరైనను పాడదలచినవారు వచ్చి పాడుకోవలెను. వివరములు కొరకు పై కోర్టు నజారత్ ఆఫీస్ యందుగాని DHR అడ్వకేటు గారి ఆఫీసు నందు గాని తెలియపర్చబడును.

SCHEDULE

East Godavari Disrict, Kakinada Sub-Registry, Kakinada Rural Mandal, Turangi Village, Ziraiyathi Wet Land, Ward No. 14, House No. 14-6, Survey No. 161/1, New Survey No. 217/1 to an extent of 227.88 sq.yards within the following Boundaries and measurements. **East** : 73.7 ft - the remaining land in the same Survey Number; **West** : 73.3 ft - 3rd parties property. **North** : 28.0 ft - Road, **South** : 28.0 ft - 3rd Parties property. with all easementary rights

DHr Value	:	Rs.6,00,000/-
Ameen Value	:	Rs. 40,00,000/-
JDr Value	:	Not claimed

G.Divya Sree Vidya
D/o. G Paida Rao, Advocates
Kakinada Saakhavari St, Jagannaickpur
Dt. 15-8-2024 Kakinada -2, Cell: 9246699297